**కథ**

**మా చారుమతి బామ్మ నోరు తెరిచిందంటే వేదాంతం వరదలై పారుతుంది. సామెతలు, లోకోక్తులు, పలుకుబడులు వరసబెట్టి ఆ నాలుక మీద నుంచి దొర్లుతాయి.**

# మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్

''శివుడి ఆజ్ఞలేనిదే చీమయినా కుట్టదంటారు. ఇక నూరేళ్ల పంట అయిన పెళ్లిళ్ల గురించి చెప్పేదేముంది దేనికైనా సమయం రావాలి. మన చేతిలో ఏమీ లేదు'' నా పెళ్లి ఆలస్యమవుతోందంటూ బెంగపడుతున్న అమ్మను ఉద్దేశించి బామ్మ ఓదార్పుగా అన్న మాటలవి. ఇంతలో తాతయ్య రంగప్రవేశం చేసాడు ''ఏమిటి అంటున్నావ్ చారూ'' అని.

''మిమ్మల్ని ఆ 'చారూ-పులుసూ' అంటూ పిలవొద్దని ఎన్నిసార్లు చెప్పాను? ముసలితనానికి దసరా పండగ అన్నట్టు- నన్ను ఆ పొట్టిపేర్లతో పిలిచే మోజేవిటి మీకు?''

''ఈ మోజు ఇప్పటిది కాదులే. పెళ్లయిన కొత్తలోనయినా పెళ్లాన్ని సరదాగా ముద్దుపేరుతో పిలుచుకునే యోగం లేకుండా మీ వాళ్లు ఏరికోరి 'చారుమతి' అని పెట్టారు. ఈ కొస, ఆ కొస రెండూ దొందుకు దొందే. అయినా 'చారు' అంటే అందమైన అని అర్థం అట. నీకు తెలుసా?'' అన్నాడు తాతయ్య.

''ఏమో నాకవన్నీ తెలియవు. 'చారు' అంటే అన్నంలో పోసుకునే ఆ ఏడిచారే గుర్తుకువస్తుంది ఎవర్కైనా. అందుకే నన్నలా పిలవద్దని నలభై ఏళ్లుగా చెబుతున్నాను. అయినా నాకు తెలియక అడుగుతాను. 'మీవాళ్లు' అంటున్నారు. 'మావాళ్లు' అంటే మీ అక్కయ్య-బావేగా. పైగా శ్రావణ శుక్రవారం పుట్టానని నాకు 'చారుమతి' అని పేరు పెట్టమని సలహా ఇచ్చింది మీ అమ్మేనట''

''అంటే మీ అమ్మమ్మ''

''అవును''

''నా ఖర్మగాలి అక్కబిడ్డను చేసుకున్నాను. ఎంచక్కా అత్తింటి వాళ్లను సాధించడానికి కూడా వీలులేకుండా''

బామ్మ తాతయ్యల సంభాషణ ఇంత లేటు వయసులోనూ అంత సరదాగా వుండడం మాకు రోజూ తెలిసిన విషయమే.

''ఏమిటి కోడలితో అంటున్నావు?''

''పిల్ల పెళ్లి గురించి దిగులుపడుతుంటే. పెళ్లిళ్ల స్వర్గలోకంలో ఎప్పుడో జరిగిపోతాయే పిచ్చిదానా, ఎవరికి ఎవరో ఆయన ముందే రాసిపెట్టి వుంటాడు. మనం చేయవలసింది ప్రయత్నం మాత్రమే అని చెబుతున్నాను''

బామ్మ మాటలకు మా తాతయ్య చాలా రియాక్టయి అమ్మవైపు తిరిగి అన్నాడు- ''మీ అత్తగారు చెప్పింది నూటికి నూరుపాళ్లు సత్యం అమ్మాయ్. అందుకు నిలువెత్తు సాక్ష్యం మా జంటే. కనిపించటంలేదూ''

మా తాతయ్య తెలుగు సినిమాల్లో రమణారెడ్డి అయితే మా బామ్మ కల్పనారాయ్. బామ్మ అమ్మమ్మ, బామ్మ అమ్మ, బామ్మ అందరూ... ఒక్కొక్క కల్పనారాయ్‌లేనట. పెళ్లినాటికే తాతయ్య రివటలా, బామ్మ బెలూన్‌లా ఉండేవారు. అప్పటినుంచీ ఇప్పటి వరకూ అంతే. వాళ్లని చూస్తే అనిపిస్తుంది- అసలు వీళ్లిద్దరికీ పెళ్లి చేయాలన్న ఆలోచన మొట్టమొదటిసారిగా వచ్చిన ఆ మహానుభావులు ఎవరా అని.

తాతయ్య అన్న దెప్పిపొడుపు మాటలకు బామ్మ చేతులు తిప్పుతూ బానంత నోటితో సమాధానం చెప్పింది.

''అయిపోయిన పెళ్లికి మేళాలు ఎందుకు అన్నట్టు ఎప్పుడో అయిన పెళ్లికి ఇప్పుడెందుకు దెప్పటం? నన్ను సన్నబడలేదని ఆటపట్టిస్తారుగానీ ఎంత తిండిపెట్టినా ఆ ఎముకల గూడులో పిసరంత కొవ్వు పట్టించుకుని మీరు కొంచెమైనా లావు కాగలిగారా? అదెలా అసాధ్యమో ఇదీ అంతే. అయినా ఆరోజుల్లో ఆస్తిపాస్తులు, కులగోత్రాలు, వంశాచారం ఇవన్నీ చూసారుగానీ అందచందాలు, లావు సన్నాలు చూసారా? ఒక మాట అడుగుతాను నిజం చెప్పండి. నలభై సంవత్సరాలుగా నాతో సహజీవనం చేస్తున్నారు కదా. ఏనాడైనా ఏదయినా మీకు తక్కువ చేసానా?''

''అబ్బే లేదు. అన్నీ ఎక్కువే'' నర్మగర్భంగా అన్న తాతయ్య మాటలని గ్రహించలేని బామ్మ నిజమేననుకుని బోలెడు మురిసిపోయింది. ఆసక్తిగా సాగుతున్న ఆ సంభాషణలో తనూ భాగం పంచుకుంటూ అంది అమ్మ-

''అత్తయ్యగారూ.. మీ పెళ్లప్పటికి మీరు చాలా చిన్న పిల్లలు కదూ'' అని.

తన పెళ్లినాటి ముచ్చట్లనేసరికి రెచ్చిపోయి సమాధానం ఇచ్చింది బామ్మ. ''అప్పుడా, నాకు సరిగా గుర్తుకూడా లేదు నా పెళ్లి. ఎనిమిదేళ్ల పిల్లనట. పెళ్లంటే పల్లకిలో కూర్చుని ఊరేగటం, ఒళ్లంతా నగలు పెట్టుకోవటం అని మురిసిపోయిన నేను అప్పగింతలు చేసి అత్తగారింటికి... అదే మా అమ్మమ్మగారింటికి పంపిస్తుంటే నేను పోనని ఏడ్చానట''

''అప్పుడు నేను అమాంతం చంకనేసుకుని ఎత్తుకుని పల్లకి దాకా తీసుకెళ్లి ఆ తర్వాత మోయలేక బొక్కబోర్లా పడితే అందరూ నవ్వారట కూడా'' అన్నాడు తాతయ్య.

''చాల్లే ఊరుకోండి. ఎనిమిదేళ్ల పిల్లని. పదహారేళ్ల వయసున్న మీరు మోయలేనందుకు సిగ్గుపడాల్సిందిపోయి గొప్పగా చెబుతున్నారు. మీరు మాత్రం తాళికట్టే సమయంలో పీటల మీద కూర్చునే నిద్రపోతే బ్రాహ్మడితో సహా అందరూ కంగారుపడిపోయి నిద్రలేపటానికి నానా హైరానా పడ్డారటగా'' అంది బామ్మ.

★ ★ ★

బామ్మ అన్నట్టు నిజంగా పెళ్లిళ్లు స్వర్గలోకంలో జరుగుతాయా?

మ్యారేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అనేది నిజమేనా? అని ఆలోచిస్తుండగా ''అమ్మా ఝాన్సీ! ఏం చేస్తున్నావ్ లోపల? ఒకసారిలా రా'' అని పిలిచారు నాన్న. నా ఆలోచనల్లోంచి ఉలిక్కిపడి లేచి వెళ్లాను హాల్లోకి.

''ఇదిగో ఈ ఫొటో ఎలా ఉందో చూడు''

ఫొటో చేతిలోకి తీసుకుని చూసాను. నాకేమీ నచ్చలేదు. ఆ విషయమే చెబితే బుగ్గలు నొక్కుకుంది బామ్మ.

''పిదపకాలం పిదపబుద్ధులు అని. ఏమయిందే ఝాన్సీ ఆ ఫొటోలోని అబ్బాయికి. అయినా మగవాడికి అందం ఏమిటి?''

''మొత్తానికి ఆడదానికి అందం వుండాలని ఈ రకంగానైనా అంగీకరించావ్. అంగీకరించిన దానివి కాస్త నువ్వూ పాటించి వుంటే బాగుండేది'' బామ్మను బనాయించటం మొదలుపెట్టాడు తాతయ్య.

''ఇప్పుడు నా విషయం ఎందుకు ఇక్కడ?'' అని ఉరిమి చూడడంతో మళ్లీ కిక్కురుమనలేదు తాతయ్య.

''అమ్మాయ్ ఝాన్సీ! పెద్దదాన్ని చెబుతున్నాను

విను. మగవాడికి వుండాల్సింది అందంకాదు. ఠీవి, దర్పం, మగ మహారాజు దర్జా. ఇవన్నీ ఈ అబ్బాయిలో ఉన్నట్టుగా అనిపిస్తోంది''.

''అయితే నువ్వే చేసుకో'' అని ఫొటో బామ్మచేతిలో పెట్టి విసురుగా వెనక్కి తిరిగాను.

''నా కొంప ముంచకే తల్లీ. నీకు పుణ్యం వుంటుంది'' అన్నాడు తాతయ్య వెనక నుంచి. ఆ మాటలకు నేను అలాంటి సమయంలోనూ నవ్వకుండా వుండలేకపోయాను.

''దానికీ వాడికీ రాసిపెట్టి వుంటే అది వద్దన్నా ఈ పెళ్లి అయి తీరుతుంది. నువ్వు నీ ప్రయత్నాలు చేయరా విశ్వం. చూద్దాం'' అంటోంది బామ్మ నాన్నతో.

'ఇది బామ్మ కాదు. నా జీవితాన్ని పేల్చేయడానికి నా పక్కనే దాపురించిన మానవబాంబు. కాకుంటే ఏమిటి? తన వేదాంతంతో నన్ను కట్టిపడేయాలని చూస్తోంది' అనుకున్నాను.



రీడింగ్ రూమ్‌లోకి వెళ్లి పుస్తకం చేతిలోకి తీసుకుని మళ్లీ అనుకున్నాను- 'రియల్లీ మ్యారేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్?' అని. అలా అనుకున్నానో లేదో ఎదురుగా గోడమీద మా అమ్మానాన్నల పెళ్లి ఫొటో కనిపించింది.

ఆరడుగుల హైట్‌తో నాన్న. ఐదడుగుల పొట్టిదనంతో అమ్మ.

ఆ ఫొటో చూడగానే బామ్మ మాటలు మళ్లీ నా చెవుల్లో ప్రతిధ్వనించి నన్ను భయపెట్టాయి. అయినా వెంటనే తేరుకున్నాను.

ఎందుకంటే- నేను మా నాన్నకు కాస్త తక్కువ. మా అమ్మకు కాస్త ఎక్కువ. వెరసి నా హైట్ ఫైవ్ త్రీ. అందంగా కూడా వుంటాను. అలా అనిపించగానే నాలో అందమైన అహంకారం ఏదో ఒక్కసారిగా ఉవ్వెత్తున లేచింది.

'నేను పెళ్లి విషయంలో చస్తే రాజీపడను. నాకు నచ్చినవాడు... అన్ని విషయాల్లోనూ నాకు సరిజోడీ అయినవాడు దొరికితేనే పెళ్లికి ఒప్పుకునేది. మా జంట మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా వుండి మా బామ్మ కుళ్లుకోవాలి. తన స్వర్గంలో పెళ్లి డైలాగ్‌ను వాపస్ తీసుకుని 'పెళ్లిళ్లు భూలోకంలో మన ఇష్టప్రకారం మనం సెలక్ట్ చేసుకున్న వ్యక్తితోనే అక్షరాలా జరుగుతాయని అంగీకరించాలి' అనుకున్నాను.

''ఏమండీ ఏం చేస్తున్నారు? ఒక్కసారి ఇలా రండి. కాస్త ఆ పప్పు డబ్బా ఇలా అందించి వెళ్లండి'' అని అమ్మ, నాన్నను పిలవటం వినిపించి కిచెన్‌లోకి వెళ్లాను.

అమ్మకాళ్లెత్తి పై అలమారాలోని డబ్బాను అందుకోవటం కోసం విశ్వప్రయత్నం చేస్తోంది. సాధ్యం కాలేదు. నాన్న వచ్చి సునాయాసంగా అందుకున్నారు.

''ఈ పొట్టి పెళ్లాన్ని చేసుకుని నా జీవితాన్ని నేను దుర్భరం చేసుకున్నాను. దీనికి పప్పుడబ్బాలు అందించటం, దండెం మీది బట్టలు తీసివ్వడం, తలుపు పై బోల్టులు తీసిపెట్టడంతోనే నా బతుకు తెల్లారిపోతోంది'' అని అందంగా విసుక్కున్నారు నాన్న.

''మీరు పెద్ద పొడగరిలెండి. అయినా పెళ్లిచూపులనాడు ఎక్కడికి పోయింది మీ బుద్ధి? కళ్లు కనబడలేదా బుర్రపనిచేయలేదా?''

''నా కళ్లు నా బుర్ర లక్షణంగా వున్నాయి. మీ వాళ్లే ఎత్తు చెప్పులు తొడిగించి, నేల మీదకి జీరాడే చీరతో వాటిని కనబడకుండా కప్పించి నా కళ్లే నన్ను మోసం చేసేలా చేసారు''

''ఆ మోసాలూ, మాయలూ మీ వాళ్లకే తెలుసుగానీ మావాళ్లకి కాదు. పెళ్లిచూపులనాడు మీ అక్కయ్యే చనువుగా లోపలి గదిలోకి వచ్చి మీకన్నా ముందు నన్ను చూసి 'అమ్మాయి లక్ష

డా.కొఠారి వాణీచలపతిరావు

ణంగా వుంది. కాకుంటే కాస్త పొట్టి. మా తమ్ముడు ఇప్పటికే వచ్చిన ప్రతి సంబంధానికీ వంక పెట్టి తిప్పి పంపిస్తున్నాడు. కాస్త ఎత్తు చెప్పులుంటే వేసి బయటికి తీసుకురండి అమ్మాయిని' అని సలహా ఇచ్చింది. లేకుంటే మావాళ్లకేం పట్టలా. దేశంలో పెళ్లికొడుకులకి కరువొచ్చినట్టు మోసం చేసి మరీ మీ చేత తాళి కట్టించడానికి'' అంది అమ్మ.

ఈ ఎక్కువతక్కువులు, లావుసన్నాలు ఇలా ఏవో లోపాలూ, భేదాలూ వుండబట్టే దంపతులు అనుక్షణం కీచులాడుకుంటూ ఒకర్నొకరు వంకలు పెట్టుకుంటూ కలహాల కాపురం చేయవలసి వస్తోంది. అలాకాక భార్యాభర్తలు ఇద్దరూ ఒకరికొకరు తీసిపోనట్టు ఒకరి కోసమే మరొకరు పుట్టినట్టు ఈడూ జోడుగా అన్ని విషయాలలోనూ సరిసమానంగా ఉంటే ఎంత బాగుంటుంది? అలా ఎందుకు జరగదు?' అని ఆ రాత్రంతా ఆలోచిస్తూనే వుండిపోయాను. నా విషయంలో మాత్రం అలా జరగకూడదని ఎంత ఆలస్యమైనా నాకు తగినవాడు దొరికినప్పుడే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను.

★ ★ ★

''అమ్మాయ్ రుఖాన్సీ! ఈరోజు సాయంత్రం నీకు పెళ్లిచూపులు. ఇంటిపట్టునే వుండి లక్షణమైన చీర కట్టుకుని చూడంగానే కాస్త కళ్లల్లో బడేటట్టు తయారవు'' పురమాయించింది బామ్మ.

''ఇదిగో బామ్మా! నేను ఇప్పుడే చెబుతున్నాను. నువ్వు తాతయ్యను చేసుకున్నట్టుగా మా అమ్మ మా నాన్నను అంటే నీ కొడుకును చేసుకున్నట్టుగా నేను ఎవరినిపడితే వాళ్లను చేసుకోను. నాకు నచ్చాలి అంతే''

''ఆరి భడవా! మాకే వంకలు పెడుతున్నావ్. నలభై సంవత్సరాలుగా మేము, పాతిక సంవత్సరాలుగా మీ అమ్మానాన్న లక్షణంగా కాపురాలు చేసుకుంటున్నాం. మీ తాతయ్య నన్ను ఉడికించటానికి అలా ఏదో ఒకటి అంటుంటారుగానీ ఆయనకు నేనంటే ఎంత ప్రేమనుకున్నావ్. ఒక్కరోజు నేను కనిపించకపోతే పసిపిల్లాడిలా విలవిలవాడిపోతారు. పెళ్లిలో వున్న గొప్పతనం అదేనే పిచ్చిదానా'' అంది బామ్మ.

''బామ్మా! నేనో విషయం చెప్పనా? మీరందరూ సాంప్రదాయవాదులు. ఆచారాలకు, పెళ్లిపేరంటాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వాటిమీద అపారనమ్మకం వున్నవాళ్లు కనుక కట్టుబాటుకు ఇష్టపూర్వకంగా లొంగి, సర్దుబాటుతో సంసారాలు చేస్తూ అదే స్వర్గం అనుకుంటున్నారు. మీకు కోర్కెలు లేవు. అభిరుచులూ సొంత అభిప్రాయాలు లేవు. మీకు తెలిసింది ఒక్కటే- 'సంబంధం' పేరుతో ఎవడు దొరికితే వాడ్ని కట్టుకుని ఆ తర్వాత తలొంచుకుని గానుగెద్దులా ఇల్లు అనే బావిలోనే బతుకుతూ అదే స్వర్గం అని భ్రమపడుతూ వుండడం'' అంటూ ఇంకా నేను ఏదో చెబుతుండగానే బామ్మ కంగారుగా ''అమ్మాయ్ చూడామణీ! ఇలారా ఒకసారి. నీ కూతురు చూడు. ఎలా మాట్లాడుతోందో'' అని అమ్మను పిలిచింది.

''ఏం బామ్మా! నాతో గెలవలేక అమ్మను సపోర్టుకోసం పిలుచుకుంటున్నావా? నాతో ఇంకోసారి పెట్టుకోకు మరి. నేను అసలే రుఖాన్సీని. ఎంతసేపూ మీ కాలంనాటి ఆ పాత చింతకాయ పచ్చడి కబుర్లే చెబుతావుగానీ మారుతున్న కాలాన్ని, పెరిగిపోతున్న మనిషి జీవిత విలువను గుర్తించవేంటి నువ్వు. మ్యారేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్... ఓహ్... నీకు ఇంగ్లీష్ రాదు కదూ! ఐమీన్ పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని. మన ప్రమేయం ఏమీ ఉండదనీ కదూ నువ్వు అన్నది బామ్మా! ఇప్పుడు నడుస్తోంది 'ప్రేమ'ల యుగం. పెద్దలు కుదిరించిన పెళ్లిళ్లు కాకుండా ఇప్పుడు అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ ముందే కలుసుకుని మాట్లాడుకుని ఒకర్ని ఒకరు నచ్చాకే పెళ్లి చేసుకుంటున్నారు తెల్సా?''

''తెల్సు. అయినా ఆ ప్రేమ పెళ్లిళ్లూ స్వర్గలోకంలో ముందు ఆ దేవుడు నిర్ణయించాకే జరుగుతున్నవి''

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీసి ఆశ్చర్యపోయాను.

ఎదురుగా మా అన్నయ్య, పక్కన ఎవరో అమ్మాయి. ఇద్దరి మెడలోనూ పూలదండలు.

బామ్మ, ఆమె వెనుకగా అమ్మ నోట మాట రానట్టు అలాగే నిల్చుడిపోయారు. నాన్న ఆ సమయంలో ఇంట్లో లేరు. తాతయ్య కాలింగ్ బెల్ శబ్దానికి తనూ బయటికి వచ్చారు.

తెల్లటి దేహచాయతో ఇటు అన్నయ్య... అటు పక్క కారునలుపు వంటి రంగులో ఆ అమ్మాయి. అన్నయ్య నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నాడు-

''అమ్మా! ఈ అమ్మాయి పేరు జూలీ. మేమిద్దరం గాఢంగా ప్రేమించుకున్నాం. మా పెళ్లికి మీరు ఎలాగూ అంగీకరించరని నాకు తెల్సు. అందుకే మేమే ఉంగరాలు, దండలు మార్చుకుని పెళ్లిచేసుకుని మీ ఆశీస్సులకోసం వచ్చాం. మీరు అనుమతిస్తే లోపలికి వస్తాం. లేదంటే...''

అన్నయ్య పూర్తి చేయకముందే అమ్మ భద్రకాళిలా విరుచుకుపడింది.

''ఒరేయ్! ఏం పనిరా ఇది. నీకు తల్లిదండ్రి చచ్చారనుకున్నావా? ఈ పిల్ల ఎక్కడ దొరికిందిరా నీకు''

బామ్మ ఆత్రంగా ముందుకు వచ్చి అమ్మ భుజం మీద తొందరపడొద్దు అన్నట్టుగా చెయ్యేస్తూ అంది-

''చూడామణీ! అయిపోయిన పెళ్లికి నువ్వు రాద్ధాంతం చేస్తే ప్రయోజనం ఏముంటుంది? నలుగురు విని ఇంటి పరువు వీధికెక్కడం తప్ప. వెళ్లు వెళ్లి హారతి తీసుకొచ్చి కోడల్ని లోపలికి తీసుకెళ్లు. ఆ భగవంతుడు వాళ్లిద్దరికీ ఎప్పుడో ముడిపెట్టాడు గనుకనే ప్రేమ పేరుతో ఈ పెళ్లి ఇలా జరిగింది'' అని సర్దిచెప్పబోయింది బామ్మ.

''అత్తయ్యగారూ! మీ అబ్బాయి వస్తే'' అమ్మ భయానికీ సందేహానికీ తాతయ్య సమాధానం చెప్పాడు-

## నెరవేరిన ఆకాంక్ష

**'మన్మథుడు చిత్రం తన కెరీర్‌కో మలుపు' అంటోంది వర్ధమానతార అన్షు. సినిమా షూటింగ్స్‌తో బిజీగా ఉన్న అన్షు తన పుట్టినరోజుని చాలా సింపుల్‌గా చేసుకుంది. 'నా మొదటి పుట్టినరోజు ఆత్మీయతానుబంధాలకు నిలయమైన టాలీవుడ్‌లో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంది' అంటూ ఆనందంతో చెబుతోందీ భామ. 'చిన్నతనం నుంచి సినిమా తారని కావాలన్న నా ఆకాంక్ష ఇప్పుడు నెరవేరింది' అంటూ ప్రభాస్‌తో కలిసి నటిస్తున్న రాఘవేంద్ర షూటింగ్‌లో చెప్పింది.**



''ఏమీ అనడు. వాడికి నేను చెబుతాను. నువ్వు ముందు ఆ పిల్లను లోపలకి తీసుకుపో'' అంటూ.

అన్నయ్య, ఆ అమ్మాయితో లోపలికి వెళ్లిపోయాడు. నేనింకా షాక్ నుంచి పూర్తిగా తేరుకోలేదు. నా భుజం మీద ఎవరిదో చేయి పడేసరికి వెనక్కి తిరిగాను. ఇంకెవరు? మా బామ్మే!

''ఇప్పుడేమంటావ్? పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని ఇప్పుడు వాళ్లిద్దర్నీ చూసాకైనా ఒప్పుకుంటావా? రాసిపెట్టిన వాళ్లతో జరగాల్సి వున్నప్పుడు ప్రేమ సైతం గుడ్డిదవుతుంది. ఏమంటావ్?''

ఇంకేమంటాను? బామ్మ మాటలను ఇంగ్లీషులోకి తర్జుమా చేసుకుని లవ్ ఈజ్ బ్లైండ్ అని అనుకోవడం తప్ప.

★ ★ ★

అన్నయ్య పెళ్లి జరిగి కొద్దిరోజులైంది. వాళ్లిద్దర్నీ చూసిన ఆ అనుభవం తర్వాత కూడా నాలో పట్టుదల పూర్తిగా చచ్చిపోలేదు. నా పెళ్లయినా నా నిర్ణయంతో నా అభీష్టానికి అనుగుణంగా జరగాలి. మా ఇద్దర్నీచూసి మా బామ్మ 'నువ్వన్నదీ నిజమేనే' అని నా గెలుపును, తన ఓటమిని అంగీకరించాలి.

మా బంధువుల ఇంట్లో పెళ్లికి అందరితోపాటు నేను కూడా వెళ్లినప్పుడు అక్కడ కనిపించాడు నా కలల రాకుమారుడు.

ఐదడుగుల పదంగుళాల ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు, ఆకర్షణీయమైన అందమైన ముఖానికి తీర్చిదిద్దినట్టు మీసకట్టు... అబ్బ ఎంత బాగున్నాడో!

'ఈ అబ్బాయి నా భర్తయితే ఎంత బాగుంటుంది?' అన్న ఆలోచన రాగానే బామ్మను పిలిచి ఆ అబ్బాయిని చూపించి విషయం చెప్పాను.

అంత భారీబామ్మా ఆనందంతో గంతులు వేసింది. అంతే హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ ఆ అబ్బాయి పుట్టుపూర్వోత్తరాలన్నీ సేకరించింది.నాకంతా కలలా వుంది. అయోమయంగా, గమ్మత్తుగా వుంది. ఆశ్చర్యకరమైన ఆ ఆనందంలో నేను మునిగి వుండగానే విత్ ఇన్ నో టైమ్ నాకూ సుకుమార్‌కూ పెళ్లి జరిగిపోయింది.

★ ★ ★

ఆరోజు మా శోభనం. ఆ రాత్రి అమ్మ నాకేవేవో జాగ్రత్తలు చెబుతూంటే బామ్మ మాత్రం అదో విధమైన నవ్వుతో నన్ను తెగ ఆటలు పట్టించింది.

నేనేమీ మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకునే అన్నీ విన్నాను. అమ్మ చెప్పినట్టు గదిలోకి అడుగుపెట్టాను.

నా మనసు ఏదేదో ఊహిస్తోంది. బామ్మ స్పెషల్‌గా వేయించిన పాత కాలం పట్టెమంచంమీద అంచున... అతను ఠీవిగా కూర్చుని నాకోసం ఎదురుచూస్తూ వుంటాడు. నేను గదిలో అడుగు పెట్టగానే కొదమసింహంలా రాచరికం వుట్టిపడుతున్న నడకతో వచ్చి తన మునివేళ్లతో నా తలను పైకెత్తి చిలిపిగా నా కళ్లల్లోకి చూస్తాడు- కలల లిస్టు పెరిగిపోతోంది. కానీ ఊహించిందేమీ జరగటం లేదు. పైగా 'ఝాన్సీ' అన్న కేక వినిపించింది.

ఉలిక్కిపడి తలెత్తాను. ఆశ్చర్యపోయాను. నా శోభనం మొగుడు ఠీవి మాట అటుంచి, నడిమంచంలో కాళ్లు పైకి పెట్టుకుని ముడుచుకుని కూర్చోవడం కనిపించింది.

''ఝాన్సీ! మీ ఇంట్లో ఏంటి ఇన్ని ఎలకలున్నాయి. పైగా అవి ఇష్టం వచ్చినట్టు ఎక్కడంటే అక్కడ స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పుడే నా కాలు మీంచి ఓ చుంచెలుక పోయింది. మంచం దిగాలంటే భయంగా వుంది'' అన్నాడు.

ఆ దృశ్యానికి, ఆ మాటలకు నాకు నవ్వు రాకపోగా చిరాకు కలిగింది. ఇందాక బామ్మ 'సుకుమారుడు' అంటే కేవలం పేరులోనే అనుకున్నాను విగ్రహంలో మాత్రమే రాకుమారుడు, చేష్టలలో సుకుమారుడు, భీరుడు అన్నమాట.

తెల్లవారాక నా ముఖంలో ముఖంపెట్టి నా కళ్లలో కళ్లు పెట్టి నా హావభావాలను మనసును చదవాలని ప్రయత్నిస్తున్న బామ్మ నుంచి తప్పించుకుని తిరిగాను. అయినా వదలించుకుందామంటే వదిలే బామ్మా ఆమె. చెయ్యిపట్టుకుని నిలదీసి ''మనవరాలా ఆగు. నీ సిగ్గు బంగారంగాను. ఇంతకూ మా మానవడు నచ్చాడా నీకు. నువ్వు కోరుకున్నట్టు మేడు పర్ ఈము అదరేనా?'' అని వచ్చీరాని ఇంగ్లీషులో అడిగింది. నాకు వళ్లు మండిపోయి బామ్మ వంక కోపంగా చూసాను.

''కాదు మ్యారేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్, నువ్వన్నట్టు పెళ్లిళ్లు స్వర్గంలోనే జరుగుతాయి. నా మాటను వెనక్కు తీసుకుంటున్నానుగానీ ఇక నన్ను వదిలేయ్'' అని విసురుగా వెళ్లబోయిన నన్ను బామ్మ రెక్కపట్టి ఆపింది.

''ఝాన్సీ! వయసు పెరిగినా నీలో ఇంకా లోకజ్ఞానం లేదు. స్వర్గలోకంలో జరిగే పెళ్లిళ్లు అంటే అర్థం ఆ భగవంతుడు బాగా ఆలోచించి ఎవరికి ఎవరు తగినవారో ఎవరికి ఎవర్ని జోడిస్తే ఆ కాపురం పది కాలాలు పచ్చగా వుంటుందో బాగా తర్కించి దంపతులను ముందే నిర్ణయిస్తాడని. మన దృష్టి ఎంతసేపూ ఈడు జోడు అందచందాలు పొట్టి పొడుగు సన్నం లావూ వీటి మీదే వుంటుంది. కానీ ఆయన అలా కాదు. ఆయన ఆలోచించేది తోడు-నీడ గురించి. సంసారంలో తప్పనిసరి ఉండాల్సిన సమతూకం గురించి. తూకం అంటే ఏమిటో తెల్సా? ఒక కోపిష్టి మనిషి, ఒక తెలివితక్కువ మనిషి వున్నారంటే... వాళ్లకు ఒక మెతక మనిషి, ఒక తెలివిగల మనిషితో జోడీ కలుపుతాడు. అలా కాకుంటే ప్రతి ఇల్లూ ఒక కురుక్షేత్ర రణరంగమవుతుంది. ఇద్దరు తెలివితక్కువ వాళ్లుకలిసి చేసే సంసారం అది కొల్లేటికాపురమవుతుంది. అందరూ అందమైన వాళ్లని, తెలివిగల వాళ్లను ఏరికోరి చేసుకుంటే అందవిహీనులకు, అమాయకులకు ఇక పెళ్లిళ్లు కావద్దా. అందుకే అది దైవ నిర్ణయం. నువ్వనే ఆ ఒకరి కోసం ఒకరు పుట్టినట్టు అనేది ఏ కొందరి విషయంలోనో తప్ప అందరి జీవితాల్లోనూ సాధ్యమయేది కాదు. జీవితం అంటేనే తృప్తి, అసంతృప్తి, కష్టం సుఖం, అందం అందవిహీనత... మనం చేయవలసిందల్లా ఉన్నదాంట్లోనే తృప్తిపడి జీవితాన్ని ఆనందమయం చేసుకోవటమే. దానికి కావలసింది కాస్త ఓర్పు, నేర్పు, సర్దుబాటు. దాంపత్య జీవితంలో భార్యాభర్తల మధ్య వుండవలసింది ప్రేమాభిమానాలు, పరస్పర అవగాహన. అవి వుంటే ఎవరిలో ఎన్ని లోపాలున్నా ఎక్కువతక్కువలున్నాసరే ఆ కాపురం నందనవనమవుతుంది. ఆలుమగల అనుబంధం ఒక్క రాత్రి నిద్రతోగాక క్రమక్రమంగా సహజీవనం వల్ల గట్టి పడేది. నీ భర్తను నువ్వు ప్రేమించడం మొదలుపెట్టు. అతను నిన్ను ప్రేమించి, నీ చుట్టూ తిరిగేలా చేసుకో. అప్పుడు చూడు 'మా ఆయన బంగారం' అని నీ నోటితో నువ్వు అనకుంటే అప్పుడు నన్ను అను'' అని ముగించింది బామ్మ.

నేను చేష్టలుదక్కి అలా ఎంతసేపు నిల్చుండిపోయానో నాకే తెలియదు.

ప్రతి ఇంటా ఇలాంటి బామ్మ లేక ఇలాంటి మరెవరయినా ఒకరు ఉంటే ఈ ప్రపంచంలో ఛిద్రమవుతున్న ఎన్ని సంసారాలు నిలబడి వుండేవి! కూలిపోతున్న ఎన్ని కాపురాలు నిలదొక్కుకోగలిగి వుండేవి- అనుకున్నాను బామ్మ వంక పరవశంగా చూస్తూ.

✤

